క్లుప్తంగా

ఘనంగా కుసుమ హరనాథ కల్యాణం



గుడివాడ టౌన్: స్థానిక గౌరీశంకరపురంలోని శ్రీ కుసుమ హరనాథ స్వామి దేవస్థానంలో స్వామి వారి కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. నవసప్తమిని పురస్కరించుకుని స్వామి వారి కల్యాణం జరిపామని నిర్వాహకులు తెలిపారు. వై. మల్లేశ్వరరావు-కుసుమ, టి. రమేష్-కుసుమ దంపతులు పూజలో పాల్గొని స్వామి కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు రాయల ఆంజనేయ రత్నప్రసాద్, కార్యదర్శి కేవీ రమణ, కోశాధికారి ఎం.పాపారావు పాల్గొన్నారు.

బీసీ రుణాల దరఖాస్తుకు గడువు పెంచండి

గుడివాడ టౌన్: బీసీ రుణాల దరఖాస్తులకు సంబంధించి గడువు పెంచాలని కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యదర్శి వడ్డాది రాజేష్ కోరారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బీసీలకు సరైన సేవలు అందించడం లేదని ఆరోపించారు. బీసీలకు రుణం మంజూరు చేస్తామని చెప్పి, వాటికి దరఖాస్తు చేసుకునేందుకు కేవలం ఏడు రోజులు వ్యవధి ఇవ్వడం కూటమి ప్రభుత్వ మోసపూరిత విధానమని పేర్కొన్నారు.

లోకుమూడిలో ఫిజియోథెరపీ సేవలు



మండవల్లి: మండలంలోని లోకుమూడి హైస్కూల్లో ఉన్న భవిత సెంటర్‌లో మంగళవారం ఫిజియోథెరపిస్ట్ కె.సునీత ప్రత్యేక అవసరాలు ఉన్న ఏడుగురు చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలను అందించారు. రోజూ చిన్నారులకు వారి ఇళ్ల వద్ద ఉదయం, సాయంత్రం ఆయిల్ రాసి క్యాంప్‌లో మాదిరిగా ఎక్సర్‌సైజులు చేయించాలని సునీత పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎండీ సుఫియాన్, ఐఈఆర్‌టీలు టీ.అరుణకుమారి, పి.వసంత, జీవీ శైలజ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు

ముదినేపల్లి రూరల్: స్థానిక సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌ని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక అభిషేకాలతో పాటు ఇతర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణ అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈఓ ఆర్.గంగాశ్రీదేవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.


కోళ్ల వ్యర్థాలు తరలించే వాహనాల పట్టివేత

నందివాడ: కోళ్ల వ్యర్థాలను తరలించే నాలుగు ఐషర్ వాహనాలను ఎస్‌ఐ కె. శ్రీనివాస్, సిబ్బంది మంగళవారం పట్టుకున్నారు. సుమారు 40 టన్నులు వ్యర్థాలను తరలిస్తుండగా సిబ్బందితో కలిసి వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సమాచారాన్ని తహసీల్దార్ గురుమూర్తిరెడ్డి, స్థానిక వీఆర్వోకు తెలియజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ నిందితులను గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్లస్టర్ పాఠశాలలుగా హైస్కూళ్లు

ముదినేపల్లి రూరల్: మండలంలో క్లస్టర్ పాఠశాలలుగా ఐదు జెడ్పీ హైస్కూళ్లను అధికారులు ఎంపిక చేశారు. ఈ మేరకు విద్యాశాఖ అధికారులను ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని ముదినేపల్లి, బొమ్మినంపాడు, అల్లూరు, పెదగొన్నూరు, పెదపాలపర్రు హైస్కూళ్లను క్లస్టర్లుగా ఏర్పాటుచేశారు. ఒక్కొక్క క్లస్టర్ పరిధిలో 12 నుంచి 15 పాఠశాలలు ఉంటాయి. మండలంలో 54 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఎనిమిది హైస్కూళ్లు ఉన్నాయి. ఈ క్లస్టర్ హైస్కూళ్లలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తారు.

నాగయ్యకు పరామర్శ



ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి ఎంపీటీసీ సభ్యుడు మరీదు నాగయ్యను వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, పార్టీ నాయకులు మంగళవారం పరామర్శించారు. నాగయ్య అస్వస్థతకు గురైనట్లు సమాచారం అందుకున్న నాయకులు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.

కూటమి ప్రభుత్వంలో పన్నుపోటు

గుడివాడ డివిజన్‌లో రూ.45 కోట్ల వసూలుకు డిమాండ్





పన్ను వసూలు చేస్తున్న ఉద్యోగులు

గుడ్లవల్లేరు: కూటమి ప్రభుత్వంలో పన్నుపోటు అధికమైంది. వసూళ్లకు సంబంధించి ఒత్తిడి కూడా అధికమైంది. గుడివాడ డివిజన్‌లోని 14 మండలాల్లోని 284 గ్రామాల్లో ఎరియర్స్‌తో సహా రూ.45,01,19,032ను వసూలు చేయాల్సి డిమాండ్ ఉంది. కాగా అందులో రూ.10,80,42,611ను అంటే 24 శాతం మేరకు ఇప్పటికే అధికారులు వసూలు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలోనే చంద్రబాబు ఇంటి పన్నులను ఏటా ఐదు శాతం పెంచే విధంగా చట్టం చేశారు. ఆ చట్టాన్ని ఏటా అమలు చేయటంతో పన్నులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతున్నాయి. అలాగే ప్రస్తుతం ఈ నెల ఒకటో తేదీ నుంచి పట్టణాల్లో 10-20శాతం వరకూ కూటమి ప్రభుత్వం పెంపొందించిన భూముల విలువలను బట్టే పన్నులు అమాంతంగా పెరిగిపోయి ప్రజలకు భారం అయ్యాయి. ఈ నేపథ్యంలో ఇంటి పన్నుల విషయంలో కూటమి ప్రభుత్వం పన్నులను పెంచేస్తుందని ప్రజలు వాపోతున్నారు. ఈ పన్నులను మార్చిలోగా వసూలు పూర్తి చేసేందుకు రంగం సిద్ధం చేశారు.

ముక్కు పిండి వసూలు



ఇంటి పన్నులను ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. వరుస తుపాన్లతో రైతులకు పంట దిగుబడులు సరిగా రాక ఆర్థికంగా దెబ్బతిన్నారు. సంక్షేమ పథకాలు అనేవి గత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే పోయాయి. ఇబ్బందుల్లో ఉన్న ప్రజలపై పన్నుల భారం అధికమైపోయింది.

– ముక్కు సోమేశ్వరరావు, శేరీ దగ్గుమిల్లి ఎంపీటీసీ, గుడ్లవల్లేరు మండలం

పన్నులు పెంచేశారు



గత వైఎస్సార్ సీపీ పాలనలో కంటే కూటమి ప్రభుత్వ హయాంలో ఇంటి పన్నులను బాగా పెంచేశారు. ఎన్నికల ముందు సంపద సృష్టించి అభివృద్ధి చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే ప్రజలపైనే ఇలాంటి పన్నుల భారం వేసి అదే సంపద సృష్టి అనడం దారుణం.

– బలుసు శ్రీసంధ్య, వైఎస్సార్ సీపీ నాయకురాలు, పెంజెండ్ర, గుడ్లవల్లేరు మండలం

క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నయంచేయొచ్చు



ప్రసంగిస్తున్న డాక్టర్ లక్ష్మీప్రియదర్శిని



క్యాన్సర్‌పై అవగాహన కల్పించిన డాక్టర్ సురేఖతో వైవీఎన్నార్ కాలేజీ సిబ్బంది

గుడివాడ టౌన్: క్యాన్సర్ లక్షణాలను ముందుగా గుర్తిస్తే ప్రాణాలు కాపాడటం తేలికేనని విజయవాడ హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్ వైద్యురాలు డాక్టర్ కె. లక్ష్మీ ప్రియదర్శిని అన్నారు. స్థానిక ఏఎన్నార్ కళాశాల్లో మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాణాంతక వ్యాధి గురించి అవగాహన కలిగిఉండటం, ముందస్తుగా గుర్తించడం ముఖ్యమన్నారు. ప్రతి ఏటా ప్రపంచ వ్యాప్తంగా 10 మిలియన్‌లకు పైబడి ప్రజలు క్యాన్సర్ బారినపడి ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. డబ్ల్యూహెచ్‌వో నివేదిక ప్రకారం 40 శాతం రోగులు క్యాన్సర్ నివారణ పొందడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, ఉమెన్ డెవలప్‌మెంట్ చైర్ పర్సన్ డి. విమల కుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన

స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో తారక రామా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. క్యాన్సర్ లక్షణాలు వివరిస్తూ ప్ల కార్డుల ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎం. బ్రహ్మయ్య, కార్యదర్శి చిన్నం గంగాధరరావు, సభ్యులు పి.రామకృష్ణ, కె.వెంకటేశ్వరరావు, సీహెచ్. మల్లిక్, పి.కేశవరావు పాల్గొన్నారు.

మంచి జీవనశైలితో క్యాన్సర్ దూరం

కైకలూరు: మంచి జీవనశైలి పద్ధతులు అవలంబించి క్యాన్సర్‌ను దూరం చేసుకోవచ్చని గైనకాలజిస్టు డాక్టర్ కామినేని సురేఖ పేర్కొన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైవీ ఎన్నార్ డిగ్రీ కాలేజీలో ఉమెన్ ఎంపవర్‌మెంట్, జువాలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో క్యాన్సర్ నివారణ పద్ధతులపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ వై.జ్ఞానప్రసూనాంబ, జువాలజీ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ డాక్టర్ వి.సంధ్య పాల్గొన్నారు.

జాతీయ క్రీడలకు గుడ్లవల్లేరు విద్యార్థుల ఎంపిక



విజేతలతో డాక్టర్ కరుణకుమార్

గుడ్లవల్లేరు: జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో తలపడేందుకు జేఎన్‌టీయూ కాకినాడ తరఫున మహిళల, పురుషుల జట్లకు శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులు వివిధ పోటీల్లో గెలుపొంది ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్ విలేకరులకు మంగళవారం తెలిపారు. జేఎన్‌టీయూకే వారు గత నెల 27, 28వ తేదీల్లో ఏలూరులో నిర్వహించిన అంతర్ కళాశాలల పోటీల్లో హ్యాండ్ బాల్ పోటీల్లో తృతీయ స్థానాన్ని తమ విద్యార్థులు సాధించారన్నారు. ఈ నెల 1, 2వ తేదీల్లో ఒంగోలు పేస్ ఇంజినీరింగ్‌లో జరిగిన బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో మహిళలు, పురుషుల విభాగంలో ప్రథమ స్థానం సాధించారన్నారు.

జాతీయ పోటీల్లో తలపడనున్న విజేతలు

హ్యాండ్ బాల్‌లో గెలుపొందిన తమ విద్యార్థి ఎం.మారుతీ నాయక్ ఈ నెల 12నుంచి 15వ తేదీ వరకు సేలం పెరియార్ యూనివర్సిటీలో జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో తలపడనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. బాల్ బ్యాడ్మింటన్ మహిళల విభాగంలో సేలం యూనివర్సిటీలో జరిగే అంతర్ పోటీల్లో షేక్ నస్రీన్, చాందిని, వై.ప్రణీత తలపడనున్నారని తెలిపారు. ఇదే విజేతలు వచ్చే నెలలో కరైకుడి అలగప్ప యూనివర్సిటీలో జరిగే పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. పురుషుల విభాగంలో తమ విద్యార్థులు బి.సురేంద్రనాయక్, కె.మురళి బెంగళూరు నార్త్ యూనివర్సిటీలో జరిగే అంతర్ రాష్ట్ర విశ్వవిద్యాలయాల పోటీల్లో తలపడనున్నట్లు పేర్కొన్నారు.

10 మంది జూదరుల అరెస్టు

ఎలకుర్రు(పామర్రు): పామర్రు మండలం ఎలకుర్రు, నిమ్మకూరులో పేకాట శిబిరాలపై మంగళవారం దాడులు నిర్వహించి 10 మంది జూదరులను అరెస్టు చేసినట్లు పామర్రు ఎస్‌ఐ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.19,900ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

దివాకర.. నమస్తుభ్యం



పామర్రులో సూర్యదేవునికి పూజలు



గుడివాడలో నిర్వహించిన చండీహోమంలో హోమద్రవ్యాలు వేస్తున్న ఎమ్మెల్యే



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా రథసప్తమి పూజలు

పామర్రు: రథ సప్తమి సందర్భంగా మంగళవారం స్థానిక బుచ్చమ్మతల్లి ఆశ్రమంలోని నవగ్రహాలలోని సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదిత్య హృదయ పారాయణ, అష్టోత్తర పూజలు చేశారు. స్థానిక శివాలయంలోని స్వామి అభిషేకాలు అర్చకులు కె కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఘనంగా చండీహోమం

గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్‌లో వేంచేసియున్న శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం చండీహోమం నిర్వహించారు. రథసప్తమి వేడుకల్లో భాగంగా ఈ హోమం నిర్వహించినట్లు ఆలయ ఈఓ కె. గోపాలరావు తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ సూర్య భగవానుడి దీవెనలు ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటున్నానన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, దేవస్థానం చైర్మన్ ఎస్.రాజేష్ పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న భక్తులు

పామర్రు: ఉండ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో రథసప్తమి సందర్భంగా మంగళవారం ఆలయంలో భక్తుల తాకిడి ఎక్కువైంది. భక్తులు పాల పొంగళ్లను స్వయంగా వండి స్వామికి నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. పూజలను ఆలయ అర్చకులు ఏ రామాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఈఓ ప్రసాద్ తెలిపారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: రథసప్తమి వేడుకలను ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పిల్లలు, పెద్దలు ఉదయాన్నే పవిత్ర స్నానాలను ఆచరించి, నూతన వస్త్రాలను ధరించి సూర్యభగవానునికి నమస్కరించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో ఇంటర్నల్ స్క్వాడ్ అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. స్క్వాడ్ ఇన్‌చార్జి చింతలపూడి ఏడీఏ నాగకుమార్ ఆధ్వర్యంలో అధికారులు రికార్డులు తనిఖీ చేసి డీలర్లకు పలు సూచనలు చేశారు. చిగురుకోట దుకాణంలో సరైన పత్రాలు లేకుండా అమ్మకానికి ఉంచిన రూ.లక్ష పైబడి విలువ ఉన్న పురుగు మందులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా నాగకుమార్ మాట్లాడుతూ ఎమ్మార్పీకి మించి ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్క్వాడ్ బృందం వెంట మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ ఉన్నారు.

బాలల వికాసానికి అంగన్‌వాడీ కేంద్రాలు కీలకం



కైకలూరు: బాలల వికాసానికి అంగన్‌వాడీ కేంద్రాలు కీలకంగా మారుతున్నాయని ఏలూరు జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.శారద అన్నారు. తనిఖీల్లో భాగంగా కైకలూరు నాలుగో వార్డు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె మంగళవారం పరిశీలించారు. ఆ సమయంలో మొత్తం 14 మంది చిన్నారులు ఉన్నారు. పిల్లల ఎత్తు, బరువులను కొలిపించారు. కార్యక్రమంలో సీడీపీఓ దీప్తి, సూపర్‌వైజర్ కృష్ణకుమారి, అంగన్‌వాడీ టీచర్ ఎన్.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

కానిస్టేబుళ్ల ఎంపిక పరీక్షలకు ఉచిత కోచింగ్

కొండాయపాలెం(పామర్రు): మనం-వనం ఫౌండేషన్ వారి సౌజన్యంతో ఏపీ కానిస్టేబుల్ ఎంపిక కోసం నిర్వహించే మెయిన్స్ పరీక్షలకు హాజరయ్యే వారికి గుడివాడలో ఈ నెల 6వ తేదీ నుంచి ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ పెనుమాల శ్రీనివాసరావు(పీఎస్ఆర్) మంగళవారం తెలిపారు. ఆర్ఆర్‌బీ, గ్రూప్-డి పరీక్షలకు హాజరయ్యే వారికి కూడా ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.వివరాల కోసం సెల్ 87902 91427, 99898 55245లను సంప్రదించాలని తెలిపారు.

రేపు మండల పరిషత్ సమావేశం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ టి.విజయసారథి మంగళవారం తెలిపారు. ఎంపీపీ కొడాలి సురేష్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

గుడివాడరూరల్: శాంతి భద్రతల పర్యవేక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు గుడివాడ తాలూకా ఎస్‌ఐ ఎస్.చంటిబాబు పేర్కొన్నారు. మండలంలోని తటివర్రు పరిధిలోని రామచంద్రాపురంలోని అన్నపూర్ణ కాంప్లెక్స్ వద్ద ఎస్‌ఐ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను మంగళవారం ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని కోరారు.

శివరాత్రి మహోత్సవాలపై అధికారుల సమీక్ష



కైకలూరు: దక్షిణ కాశీగా పిలిచే పాతాళ భోగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 24 నుంచి 28 వరకు జరుగు శివరాత్రి మహోత్సవాలకు సంబంధించి సమన్వయ కమిటీ సమావేశం కలిదిండిలో తహసీల్దారు రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి మహోత్సవాలను దిగ్విజయంగా ముగించాలని కోరారు. రూరల్ సర్కిల్ సీఐ వి.రవికుమార్ మాట్లాడుతూ మహోత్సవాలకు పూర్తి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ మాట్లాడుతూ ఈ నెల 25న రాత్రి శ్రీ పార్వతీ సమేత పాతాళ భోగేశ్వర స్వామి దివ్య కల్యాణం ఉంటుందని, ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎస్‌ఐ వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి



బేబీని అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

కైకలూరు: నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేసి, మహిళల్లో చైతన్యం తీసుకొస్తానని ఇటీవల ఎన్నికైన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మహిళా విభాగ అధ్యక్షురాలు దున్న బేబీ పేర్కొన్నారు. మంగళవారం కైకలూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)ను మర్యాదపూర్వకంగా కలిసి పదవి రావడానికి కృషి చేసిన ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా మేధావుల ఫోరం అధ్యక్షుడు దుగ్గిరాల నాగేశ్వరరావు, కలిదిండి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బ్రహ్మాజీ, మూలంక సర్పంచ్ మహదేవ విజయబాబు, ఎంపీటీసీ సభ్యులు బాలు, క్షణరావు, సత్యనారాయణ, నాయకులు అన్నవరం, లక్ష్మీపతి, నాగరాజు, జోగి కుమార్, శ్రీను, కృష్ణ, రంగబాబు, రమేష్, కోటేశ్వరరావు, ఎకో నారాయణ, ప్రసాద్, గణపతి, వెంకటేశ్వరరాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు సస్య రక్షణ చర్యలు



లింగవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఏఓ అనంతలక్ష్మి

గుడివాడరూరల్: మినుము పంటలో వచ్చే తెగుళ్ల నివారణకు రైతన్నలు సస్య రక్షణ చర్యలను ముందస్తుగానే చేపట్టాలని మండల వ్యవసాయశాఖ అధికారి బోలెం అనంతలక్ష్మి అన్నారు. మండలంలోని లింగవరం, మల్లాయపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ మినుము సాగు పూత, పిందె దశలో ఉన్నందున మారుకపూత గూడు, పురుగు పంటకు సంక్రమించే అవకాశం ఉంటుందన్నారు. పురుగు నివారణకు రైతన్నలు నోవెలెన్ ఒక మిల్లీకి ఒక లీటర్ నీటిని కలుపుకుని పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అనిత పాల్గొన్నారు.

మినుము సాగులో కలుపును నివారించాలి

పామర్రు: మినుము సాగులో ప్రస్తుతం ఉన్న కలుపు, ఊదా, బంగారుతీగను తొలగిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ అధికారి శివనాగరాణి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మండలంలో సాగులో ఉన్న మినుము పంటలో కలుపు, ఊదా, బంగారుతీగ దర్శనమిస్తున్నాయని తెలిపారు. కలుపు, ఊదాల నివారణకు విప్ సూపర్ 250 మిల్లీలీటర్లు లేదా టర్గా సూపర్ 400 మిల్లీలీటర్లు వాడితే ఫలితం ఉంటుందని పేర్కొన్నారు. బంగారుతీగ నివారణకు పరచూట్‌ను ఒక లీటరుని ఐదు ఎకరాల విస్తీర్ణంలో చల్లాలని తెలిపారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గుడివాడ టౌన్: జిల్లా స్థాయి వేదిక్ మ్యాథమెటిక్స్, అబాకస్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి బహుమతులు సాధించారని త్రివేణి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ డైరెక్టర్ ఎస్.శివశంకర్ తెలిపారు. మంగళవారం బహుమతులు సాధించిన విద్యార్థులను పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 2వ తేదీన విజయవాడ వివేకానంద కాన్సెప్ట్ స్కూల్లో జరిగిన పోటీల్లో తమ విద్యార్థులు ఎస్. తరుణ్ వెంకట సాయి ప్రథమ, కె. యశ్వంత్ ప్రథమ, సీహెచ్. శ్రీవర్ష ప్రథమ బహుమతులు సాధించినట్లు తెలిపారు. ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను అభినందించారు.

స్టేట్ అబాకస్ పోటీలకు యశ్విక ఎంపిక

గుడ్లవల్లేరు: స్టేట్ లెవెల్ అబాకస్ పోటీలకు గుడ్లవల్లేరు ఏఏఎస్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ హైస్కూల్ మూడో తరగతి విద్యార్థిని జి.యశ్విక ఎంపికైంది. ఈ విషయాన్ని ఆ హైస్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి మంగళవారం విలేకరులకు తెలిపారు. గత ఆదివారం విజయవాడలో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల సంయుక్త జోన్ స్థాయిలో నిర్వహించిన అబాకస్ పోటీల్లో యశ్విక తలపడిందని పేర్కొన్నారు. జోనల్ పోటీలో తమ హైస్కూల్లో 4వ తరగతి చదువుతున్న విద్యార్థిని జి.చార్విక జూనియర్ లెవల్ వన్ క్యాటగిరిలోనూ, రెండో తరగతి చదువుతున్న ఆర్.శ్రీచరణ్ రామ్ స్టార్ జూనియర్ లెవల్ వన్ క్యాటగిరిలోనూ కన్సోలేషన్ బహుమతులను సాధించారని పేర్కొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ కొండేటి ఇందిర

మొవ్వ: వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కొండేటి ఇందిర అధికారులకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కాజ శివారులో అయినంపూడి డ్రైయిన్‌పై బెయిలీ బ్రిడ్జ్ శిథిలమై ప్రమాద కరంగా మారిందని, మొవ్వ, నిడుమోలు, చినముత్తేవి, పాలంకిపాడు గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించాలని, కాజ గ్రామాల్లో తాగునీటి సమస్య, గత ప్రభుత్వ కాలంలో ఇచ్చిన కాలనీల్లో అంతర్గత రహదారులు అభివృద్ధి చేయాలంటూ ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు రాజులపాటి పార్వతి, వేమూరి పరిశుద్ధరాజు, ఎంపీడీఓ విమాదేవి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రెగ్యులర్ కార్యదర్శి లేక ఇబ్బందులు

మండవల్లి: మండవల్లి మేజర్ పంచాయతీ అయినప్పటికీ రెగ్యులర్ కార్యదర్శి లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, జిల్లా కన్వీనర్ టి.అప్పారావు తెలిపారు. సుమారు 10 వేల మంది జనాభా ఉన్న పంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శిని నియమించకపోవడం దారుణమన్నారు. మూడేళ్లలో ఆరుగురు కార్యదర్శులను మార్చారని, మళ్లీ మంగళవారం ఇన్‌చార్జ్ కార్యదర్శిగా మరో మహిళను నియమించారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని కోరారు.

అడుగున్నర చెట్టుకు అరటి గెల



అరటి గెలను చూపుతున్న ఆదినారాయణ

అడుగున్నర ఎత్తు ఎదిగిన అరిటి చెట్టుకు అడుగున్నర అరటి గెల వేసింది. గుడ్లవల్లేరు శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల పెరటిలో ఆ విద్యా సంస్థ అధినేత శింగంశెట్టి ఆదినారాయణ మొక్కల పెంపకంలో భాగంగా ఇలాంటి వెరైటీ అరటి చెట్లను కూడా సాగు చేస్తున్నారు. ఈ అరటి మొక్కను తిలకించేందుకు చుట్టుపక్కల వారు ఆసక్తి చూపారు. – గుడ్లవల్లేరు

నేడు ఆక్వా రైతులకు అవగాహన

కైకలూరు: ఆక్వా రైతులకు ఇన్సూరెన్స్ పథకాలపై అవగాహన కల్పించేందుకు స్థానిక సీతారామ ఫంక్షన్ హాల్లో బుధవారం ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు ఏలూరు జిల్లా మత్స్యశాఖ అధికారి నాగలింగాచార్యులు తెలిపారు. నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంటు బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశానికి ఆక్వా రైతులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.